క్లుప్తంగా

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య


రాయికోడ్‌లో బడిబాట ర్యాలీ

రాయికోడ్(అందోల్): ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామని రాయికోడ్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.విఠల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం రాయికోడ్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు విధిగా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కేదారినాథ్ పాటిల్, ఉప సర్పంచ్ రామకృష్ణ, ఉపాధ్యాయులు శివకుమార్, సుధాకర్, అంగన్‌వాడీ టీచర్ సక్కుబాయి ఉన్నారు.

లేగదూడల ప్రదర్శన


కోడెకల్లో లేగదూడల ప్రదర్శన

జోగిపేట(అందోల్): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అందోల్ మండలం కొడెకల్ గ్రామంలో పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భాధారణలో జన్మించిన లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోపాలమిత్ర సూపర్ వైజర్ అర్జునయ్య హాజరై మాట్లాడారు. లేగదూడలు జన్మించిన 7, 15వ రోజు నట్టలనివారణ మందులు వేస్తే దూడలు ఆరోగ్యాంగా ఉంటాయన్నారు. మేలుజాతి దూడలకోసం పశువులకు కృత్రిమ గర్భధారణ చేయించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నర్సింహారెడ్డి, అంజిరెడ్డి, గోపాలమిత్రలు కెఆర్ ప్రభు, నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

ఔరాద్ ఎమ్మెల్యేను సన్మానించిన సంగప్ప


ప్రభు చౌహాన్‌ను సన్మానిస్తున్న జన్‌వాడే సంగప్ప

నారాయణఖేడ్: కర్ణాటకలోని బీదర్ జిల్లా ఔరాద్ ఎమ్మెల్యేగా నాలుగోసారి విజయం సాధించిన ప్రభుచౌహాన్‌ను శుక్రవారం ఔరాద్‌లోని ఆయన నివాసంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జన్‌వాడే సంగప్ప కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ అసత్య ప్రచారాన్ని తట్టుకుని విజయం సాధించారని కొనియాడారు. తెలంగాణ రాజకీయాలపై ఆయనతో చర్చించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు సంజీవ్‌కుమార్, పట్నం మాణిక్, రాజుగౌడ్, సతీష్ పాటిల్ తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ


పెద్దారెడ్డిపేటలో ఆలయంలో ప్రతిష్ఠించిన శ్రీ సీతారామచంద్ర స్వాములవారి విగ్రహాలు

పుల్‌కల్(అందోల్): మండల పరిధిలోని పెద్దారెడ్డిపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. శ్రీమదనానంద స్వామి ఆధ్వర్యంలో మూల విరాట్‌ను ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో ఎంపీ బీబీ పాటిల్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి తండ్రిని ఓదారుస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): మండల పరిధిలోని పోతులబోగుడా గ్రామానికి చెందిన బక్క ఆనంద్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ వారి ఇంటికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆనంద్ మృతికి ప్రగాఢ సానుభూతి తెలిపి తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు శేఖర్, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఘనంగా సంక్షేమ సంబురాలు

సంగారెడ్డి మున్సిపాలిటీ : బీసీ కులవత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సహాయ కార్యక్రమాన్ని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ద ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ సంబురాలు నాడు నేడు కార్యక్రమంతో పాటు బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సహాయం, రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని కూడా సంగారెడ్డి నియోజకవర్గంలో చైర్మన్ చింతా ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి, వృత్తుల మీద ఆధారపడ్డ జీవితాలలో వెలుగులు నింపటానికి, కుల వృత్తుల మీద ఆధారపడ్డ జీవితాలకు చేయూత నివ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. సంగారెడ్డి, సదాశివపేట, కంది, కొండాపూర్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, దళిత బంధు, కల్యాణ్ లక్ష్మి, ఆసరా పెన్షన్ల చెక్కులను పంపిణీ చేశారు. గొర్రెల పెంపకం దారులకు రెండో విడత గొర్రెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ లతా విజేందర్ రెడ్డి, సంగారెడ్డి నియోజకవర్గ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, రైతు సమితి అధ్యక్షులు, ప్రజా ప్రతినిధులు సంబంధిత శాఖాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమంకోసం..

నారాయణఖేడ్: బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషిచేస్తోందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నారాయణఖేడ్ మండలం జూకల్‌లో శుక్రవారం సంక్షేమ సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖేడ్ నియోజకవర్గంలో 31,071 మందికి ఏటా రూ.84.10 కోట్లను పెన్షన్ అందించడం జరుగుతోందన్నారు. దళితబంధు ద్వారా వంద మందికి రూ.10 కోట్లు అందించామన్నారు. వివిధ సంక్షేమ పథకాలు, వాటిద్వారా లబ్ధి పొందుతున్న లబ్ధిదారులు, అందించిన సహాయాలను గురించి వివరించారు. ఎమ్మెల్యేకు కురుమ సంఘం నాయకులు గొర్రెపిల్లను బహూకరించారు. కార్యక్రమంలో డీపీఓ సురేష్ మోహన్, ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


నారాయణఖేడ్: ఎమ్మెల్యే భూపాల్ రెడ్డికి గొర్రెపిల్లను బహూకరిస్తున్న కురుమ సంఘం నాయకులు

వెనుకబడిన వర్గాల సంక్షేమానికి సర్కార్ కృషి

జహీరాబాద్ టౌన్: వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తుల వారికి అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సహాయం చెక్కులను పైలెట్ ప్రాజెక్టు కింద ముగ్గురికి అందచేశారు. గొల్ల కురుమలకు రెండో విడుత కింద గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. కుల వృత్తుల వారికి జులై 5 తేదీ తరువాత విడతల వారీగా చెక్కులను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమండలో అడిషనల్ డీఆర్డీఓ జయదేవ్, ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి, పశుసంవర్ధశాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చింతా ప్రభాకర్


కార్యక్రమంలో పాల్గొన్న లబ్ధిదారులు


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

పార్టీ పటిష్టతకు సహకారం తీసుకోవాలి

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి

పార్టీ పటిష్టత కోసం అందరి సహకారం తీసుకుని ముందుకు పోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం జహీరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పూర్వ నేతలు, ముఖ్య కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. పార్టీకి గతంలో పునాదిగా ఉన్న నేతలను సమన్వయం చేసుకుని వచ్చే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కష్టపడి పనిచేయాలన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకుడు రాంచందర్ రాజనర్సింహా, జిల్లా అధికార ప్రతినిధి పి.సుధీర్‌కుమార్, జిల్లా కార్యదర్శి జగన్నాథ్, నియోజకవర్గం ఇన్‌చార్జి కె.జనార్దన్‌రెడ్డి, జిల్లా కిసాన్‌మోర్చ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి

చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, సీఎంఆర్‌ఎఫ్ ఆర్థిక సహాయం చెక్కులు, ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. లబ్ధిదారులకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు సంబంధించి 240 మందికి, సీఎంఆర్‌ఎఫ్ కింద 82 మందికి రూ.42 లక్షలవిలువైన చెక్కులు, 624 మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు.

నిరుద్యోగుల మేలు కోసం ఖేడ్‌లో జాబ్‌మేళా



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ సంజీవరెడ్డి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రాంత నిరుద్యోగుల కోసం ఈనెల 17వ తేదీన నారాయణఖేడ్‌లో మెగా జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను నారాయణఖేడ్‌లోని తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈమేళాకి 60కి పైగా కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. 700లకు పైగా ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. అర్హతను బట్టి రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం ఇస్తారన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు దారం శంకర్, వివేకానంద్, నాయకులు నారాయణ, సిద్దారెడ్డి, నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడిచదివే వారికే భవిష్యత్

సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): విద్యార్థి దశలో కష్టపడే వారే భవిష్యత్‌లో బాగుపడతారని సంగారెడ్డి ఎమ్మెల్యే తూర్పు జయప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని వికారాబాద్ రోడ్డులో ఇంటర్నేషనల్ స్కూల్ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రమశిక్షణ, సంస్కృతి సంప్రదాయాలు, పెద్దలపట్ల గౌరవం నేర్పి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లోడి జయమ్మ, వైస్ చైర్మన్ చింతా గోపాల్, మాజీ మున్సిపల్ చైర్మన్ అత్మకూర్ రామాగౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ పిల్లోడి విశ్వనాథం, మాజీ కౌన్సిలర్ కోవూరి కృష్ణాగౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మునిపల్లి సత్యనారాయణ, పాఠశాల వ్యవస్థాపకుడు పోలసాని ప్రభాకర్‌రావు, స్కూల్ సీఈఓ పోలసాని నిధిన్‌రావు, కురుమ సంఘం జిల్లా యువజన అధ్యక్షుడు కొల్కూర్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సమస్యల పరిష్కారానికి కృషి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీలలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. శుక్రవారం రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయినగర్‌కాలనీలో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తామన్నారు.

◆ చేప మందు పంపిణీ

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్ గ్రామంలో గ్రామానికి చెందిన ఆడెం మనోహర్ సోదరులు మృగశిర కార్తె ప్రవేశించిన సందర్భంగా శుక్రవారం చేప మందు ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. దగ్గు, దమ్ము, ఎలర్జీ, ఉబ్బసం బాధితులు చేప మందు ప్రసాదాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

◆ ఫత్తేపూర్‌లో కంటి వెలుగు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఫత్తేపూర్‌లో శుక్రవారం కంటి వెలుగు శిబిరం నిర్వహించారు. 230 మందికి కంటి పరీక్షలు చేశామని సిర్గాపూర్ పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అరవింద్, సరిత, పీహెచ్‌ఎన్ నిర్మల పాల్గొన్నారు.

◆ తూతూ మంత్రంగా మండల సర్వసభ్య సమావేశం

కొండాపూర్(సంగారెడ్డి): తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణలో అధికారులు ఉండటంతో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం వారు లేకుండానే తూతూ మంత్రంగా జరిగింది. ఉదయం 11 గంటలకు జరగాల్సిన సమావేశం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమైంది. గతంలో జరిగిన సమావేశాలలో అధికారులు హాజరుకాకపోవడంతో సమావేశంలో చర్చించిన సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులతో సంతకాలు పెట్టించుకొని సమావేశాన్ని ముగించారు.

◆ ప్రజాగర్జన సభకు తరలి వెళ్లాలి

జహీరాబాద్ టౌన్: కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ఈనెల 11వ తేదీన జరగున్న సీపీఐ ప్రజాగర్జన బహిరంగ సభకు తరలి వెళ్లాలని జహీరాబాద్ డివిజన్ కార్యదర్శి నర్సింలు కోరారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుతూ సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ప్రచారాలు నిర్వహించామన్నారు. కార్యక్రమం ముగింపు సభ కొత్తగూడెంలో నిర్వహించడం జరుగుతుందని, జహీరాబాద్ నుంచి భారీగా తరలి వెళ్లి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

◆ ఇప్పెపల్లిలో కంటి వెలుగు శిబిరం

జహీరాబాద్ టౌన్: మొగుడంపల్లి మండలం ఇప్పెపల్లి గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం ఏర్పాటుచేశారు. గ్రామ సర్పంచ్ సురేశ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్రంలో కంటి వెలుగు శిబిరం నడుస్తుందన్నారు. ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు మామిడ్గి మల్‌శెట్టి, ఇప్పెపల్లి సొసైటీ చైర్మన్ మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ చెక్కుల పంపిణీ

మునిపల్లి(అందోల్): ఆయా గ్రామాలకు చెందిన 177 మంది లబ్ధిదారులకు అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ చెక్కులను అందజేశారని ఎంపీపీ శైలజా శివశంకర్, జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ శుక్రవారం తెలిపారు. జోగిపేటలో మునిపల్లి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌ల ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామాల తాజా, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరయ్యారని తెలిపారు.

◆ ఘనంగా విద్యార్చన వేడుకలు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి పట్టణం మంజీర నగర్‌లోని శ్రీ జ్యోతిర్వాస్య విద్యాపీఠం నిర్వహణలో విద్యార్చన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యాపీఠం వ్యవస్థాపకుడు మహేశ్వర శర్మ సిద్ధాంతి వైదిక పర్యవేక్షణలో 64 ఉపచారాలతో అమ్మవారికి పూజలు చేశారు. భక్తులు శివపంచాక్షరీ మంత్రాన్ని జపించారు.

◆ గుండెపోటుతో కార్మికుడి మృతి

జిన్నారం(పటాన్‌చెరు): విధులు నిర్వహిస్తున్న సమయంలో కార్మికుడికి గుండెపోటు రావటంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. ఈ ఘటన బొల్లారం పారిశ్రామిక వాడలో శుక్రవారం జరిగింది. సీఐ సురేందర్‌రెడ్డి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అందోల్‌కు చెందిన శ్రీనివాస్(39) బొల్లారం పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్నాడు. అకస్మాత్తుగా గుండెపోటు రావటంతో శ్రీనివాస్ అక్కడిక్కడే పడిపోయాడు. ఆస్పత్రికి తరలించటంతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లుసీఐ తెలిపారు.

◆ హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి

దుబ్బాకరూరల్: మన కోసం కేఆర్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోమటిరెడ్డి రజనీకాంత్‌రెడ్డి సహకారంతో మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో 250పైగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ద్విచక్రవాహన దారుడు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలన్నారు.

రైతుల శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి(అందోల్): రైతుల శ్రేయస్సే ప్రధాన లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దేవునూర్ రైతువేదిక భవనంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. క్వింటాల్‌కు రూ.2970 మద్దతు ధను చెల్లిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఖరీఫ్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు విత్తనాల కొనుగోలులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పత్రి క్రిష్ణవేణి, వరము చైర్మన్ వీరారెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు నర్సింహులు, రైతుబంధు అధ్యక్షుడు అశోక్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ బుద్ది రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శివాజీ రావు, ఏఓ మహేష్‌చౌహాన్, ఏఈఓలు సవిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

మెరుగైన సేవలు అందించండి

నారాయణఖేడ్: ఆర్టీసీ సంస్థ, ప్రయాణికుల మధ్య వారధులుగా ఉంటూ మెరుగైన సేవలను అందించేందుకు కృషిచేయాలని నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి గ్రామ బస్సు అధికారులకు సూచించారు. నారాయణఖేడ్ పరిధిలో రెండు, మూడు గ్రామాలకు ఒకరు చొప్పున గ్రామ బస్సు అధికారులను నియమించారు. వీరికి శుక్రవారం ఖేడ్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీ షర్టులు, బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తూ ప్రయాణికులకు మెరుగైన సేవలతో పాటు సంస్థ అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. అనంతరం డీఎం మల్లేశయ్య మాట్లాడుతూ గ్రామ బస్సు అధికారుల విధులను గురించి వివరించారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ వెంకట్ రెడ్డి, ఆర్టీసీ ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


గ్రామ బస్సు అధికారులుగా నియమితులైన పోలీసు అధికారులతో డీఎం

లారీలు రావడం లేదని రైతుల ఆందోళన


కల్హేర్: ఫత్తేపూర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న రైతులు

కల్హేర్(నారాయణఖేడ్): ధాన్యం తరలించేందుకు లారీలు రావడంలేదని రైతన్నలు రోడ్డెక్కరు. శుక్రవారం కల్హేర్ మండలం ఫత్తేపూర్ చౌరస్తా వద్ద ధర్నా చేశారు. గ్రామ రైతులు బీబీపేట పీఏసీఎస్ పరిధిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో 10 రోజుల క్రితం ధాన్యం తూకం చేశారు. తూకం వేసినా మిల్లులకు తరలించేందుకు లారీలు రాలేదు. దీంతో ఫత్తేపూర్-పిట్లం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. శుక్రవారం పిట్లంలో సంత కావాడంతో వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. డీసీసీబీ డైరెక్టర్ నరేందర్‌రెడ్డి అక్కడికి చేరుకుని రైతులతో మాట్లడారు. లారీలు పంపించాలని అధికారులకు చెప్పారు. ధాన్యం తీసుకెళ్లేందుకు లారీ రావడంతో రైతులు శాంతించారు.


కల్హేర్: రోడ్డుపై నిలిచిన వాహనాలు

పాఠశాలల బలోపేతానికి సహకరించాలి

పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జాకిర్ హుస్సేన్

కొండాపూర్(సంగారెడ్డి): ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని పోతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జాకిర్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ ఓ ప్రైవేట్ పాఠశాల విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. సుశిక్షితులైన ఉపాధ్యాయులతో ఉత్తమ బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్నం భోజనం, యూనిఫాం, విశాలమైన డిజిటల్ తరగతి గదులు, విశాలమైన క్రీడా మైదానం వంటి వసతులతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామన్నారు. ప్రైవేటు స్కూల్స్ నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేణుక, మదన్ గోపాల్, గోవర్ధిని, ప్రవీణ, లావణ్య, హేమలత, పుణ్యానాయక్, సత్యనారాయణ, నయీం, నాగేశం, సునీత, సీఆర్‌పీ శేఖర్ పాల్గొన్నారు.


ప్రైవేట్ స్కూల్ విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న మాజీ సీడీసీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కులు చూపిస్తూ నినాదాలు

జోగిపేట(అందోల్): అందోల్‌లో నిర్వహించిన సంక్షేమ సంబురాల్లో భాగంగా నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది మండలాలకు చెందిన 638 మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులు కుర్చీలో కూర్చొని వారికి అందజేసిన చెక్కులను చూపిస్తూ 'జైకేసీఆర్' అంటూ నినాదాలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


చెక్కులను చూపుతున్న లబ్ధిదారులు

అంబేడ్కర్ విగ్రహం తొలగింపు

వివాదాస్పదంగామారిన గ్రామ కంఠం స్థలం

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని గడ్డపోతారం గ్రామ పంచాయతీ పరిధిలోని అల్లీనగర్ గ్రామానికి చెందిన గ్రామ కంఠం స్థలం నుంచి పరిశ్రమలకు రోడ్డు కేటాయించటాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామ కంఠం స్థలంలో నూతనంగా అంబేడ్కర్ విగ్రహాన్ని స్థానికులు ఏర్పాటు చేశారు. డీఎల్‌పీఓ పాటు గ్రామ పంచాయతీ అధికారులు గ్రామ కంఠం స్థలంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించేలా చర్యలు చేపట్టారు. దీంతో వార్డు సభ్యుడు వీరేశంగౌడ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. గ్రామ కంఠం స్థలాన్ని కాపాడాలని, పరిశ్రమలకు రోడ్డు వేయటం సరైంది కాదని గ్రామస్తులు నినాదాలు చేశారు. సీఐ సురేందర్‌రెడ్డి కల్పించుకొని ఆందోళన చేస్తున్న వార్డు సభ్యుడు వీరేశం గౌడ్‌తో పాటు పలువురిని అరెస్ట్ చేశారు. అనుచిత వ్యాఖ్యలు చేస్తూ తమను అరెస్ట్ చేయటం ఏమిటని వీరేశంగౌడ్ పోలీసులను ప్రశ్నించారు. ఈ విషయంపై డీఎస్పీ, ఎస్పీకి, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.


పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం

12 నుంచి పాలిటెక్నిక్‌పై అవగాహన సదస్సులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రభుత్వ కళాశాలలోని కోర్సుల్లో ప్రవేశం, వివిధ కోర్సుల ప్రయోజనాలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బి.మల్లయ్య శుక్రవారం తెలిపారు. ఆసక్తికలిగిన, పాలిసెట్ ప్రవేశపరీక్షలో అర్హతను సాధించిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.